జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
## తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 26-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 406 పేజీలు: 4 వెల : రూ.7

* కౌన్సెలింగ్ ద్వారా పోలీసులకు బదిలీ చేసిన ఎస్పీ
* తక్షణం ఆయా పీఎస్‌లలో జాయిన్ కావాలని ఆదేశం
* కొందరు పోలీసులు ఇంకా విధులకు హాజరుకాని వైనం



## బదిలీ అయి నెల రోజులైనా..

* ఎస్పీ ఆదేశాలు బేఖాతర్
* జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ చక్కర్లు
* దొడ్డిదారిన జిల్లా పోలీసు కేంద్రానికి వచ్చేందుకు యత్నాలు

# జాయిన్ కాలేదట!

**శ్రీకాకుళం క్రైం, జూలై 25 (వార్త):** జిల్లా పోలీసులకు గతనెల కౌన్సెలింగ్ విధానం ద్వారా బదిలీలు జరిగాయి. బదిలీ అయిన వారంతా వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్లలో 24 గంటల్లో జాయిన్ కావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ బదిలీ అయిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఇంకా జాయిన్ కాలేదు. ఎలాగైనా శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి, తమ సొంత గ్రామాలకు సమీప పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేసుకునేందుకు తెరవెనుక పావులు కదుపుతున్నారు. కొందరు జిల్లా పోలీసు అధికారులను పట్టుకుని దొడ్డిదారిన తమకు నచ్చిన స్టేషన్‌లో పోస్టింగ్ వేసుకునేందుకు నానాప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎస్పీ కార్యాలయం, సబ్‌డివిజన్ అధికారుల చుట్టూ తిరుగుతూ తమను ఎలాగైనా బదిలీ చేయాలని కోరుతున్నారు. కొద్ది రోజులు ఆగాలని ఎస్పీ కార్యాలయం అధికారులు సైతం వారికి అభయమిచ్చినట్టు తెలిసింది. బదిలీ అయిన స్టేషన్‌లోనే జీతాలు తీసుకుని, జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహించేలా తాము చేయగలమని కొందరు అధికారులు వారికి సూచించినట్టు ఆ శాఖలోని కొందరు గుసగుసలాడుకుంటున్నారు. అయితే ఎస్పీ బదిలీ చేసిన తర్వాత కూడా వారిని రిలీవింగ్ చేయకుండా కొందరు అధికారులు తాత్సారం చేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయాలు ఏవీ కూడా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లకుండా కార్యాలయంలోని కొందరు అధికారులు మేనేజ్ చేస్తున్నారని తెలిసింది. ఏదేమైనా దీనిపై జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.



## యువకుడి ఆత్మహత్యాయత్నం

**సరుబుజ్జిలి, జూలై25 (వార్త):** రొట్టవలస గ్రామానికి చెందిన ధనుకోట శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు అతడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. గతంలో వెటర్నరీ కళాశాలలో అటెండర్‌గా పనిచేసేవాడు. పలు కారణాల వల్ల అతడిని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత లగేజీ వ్యాన్‌ను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అప్పు తీసుకుని చెల్లించకపోవడంతో అతని వ్యాన్‌ను అప్పు ఇచ్చిన వారు తీసుకున్నట్టు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది. అయితే కుటుంబీకులు మాత్రం పోలీసుల వేధింపుల వల్లే శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.

### వసప కేజీబీవీలో..
## బియ్యం పక్కదారి

* ఎస్‌వో తీరుపై సిబ్బందిలోనూ విభేదాలు * ప్రశ్నించేవారిపై బూతు పురాణం * రాజకీయ అండదండలు ఉన్నాయంటూ రుబాబు



**కొత్తూరు, జూలై 25 (వార్త):** వసన కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బియ్యం అక్రమంగా తరలిపోతోంది. ఈ తరలింపును కొందరు వీడియోలు చిత్రీకరించి సోషల్‌మీడియాలో పెట్టారు. ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం ప్యాకెట్లను పాఠశాల సిబ్బంది ఆటోలో ఎక్కిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలోనూ హల్‌చల్ చేసింది. ఈ వీడియోను చూసిన స్థానికులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణ పాఠశాల వద్దకు హుటాహుటిన వెళ్లి విచారణ చేపట్టారు. ఇటీవల ఈ పాఠశాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆకస్మికంగా సందర్శించారు. ఎస్‌వో తీరుపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆశయాలను కించపరిచేలా చర్యలు తీసుకుంటే సహించబోమని హెచ్చరికలు కూడా చేశారు. అయినా ఆమె పనితీరులో మార్పు కనబడలేదు. స్పెషల్ ఆఫీసర్ పనితీరు పట్ల అనేకమంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆమె వెంట ఇక్కడ సిబ్బంది రెండు మూడు గ్రూపులుగా విడిపోయి ఒకరితో ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. పాఠశాల నిర్వహణ అధ్వానంగా ఉందని, విద్యార్థులకు సరైన భోజనం కల్పించడం లేదని, సరుకులు బయటకు తరలిపోతున్నాయని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో ప్రత్యేక అధికారిపై సభ్యులు సైతం తీవ్రంగా విమర్శలు చేశారు. మండల వైస్ ఎంపీపీ తులసీ వరప్రసాద్ రావు నేతృత్వంలో ఎంపిటిసిలు, సర్పంచులు సైతం ఎస్‌వో తీరుపై కలెక్టర్‌కు నివేదిక పంపాలని తీర్మానించారు. ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు కేజీబివిలో జరిగే అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పోస్టల్.. స్కామ్

* ఇచ్ఛాపురం సబ్ పోస్ట్ ఆఫీస్ లో భారీ ఆన్లైన్ మోసం
* రూ2.86 కోట్ల కుంభకోణం
* పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా వెలుగులోకి వచ్చిన వైనం
* ఐదుగురు పోస్టల్ సిబ్బంది సస్పెండ్
* ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
* పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్



**ఇచ్ఛాపురం, జూలై 25 (వార్త):** ఇచ్ఛాపురం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ ద్వారా పెద్ద ఎత్తున మోసం జరిగినట్లు పోస్టల్ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు 33 మంది ఖాతాదారుల డిపాజిట్లు నుండి 2.86 కోట్ల రూపాయలు నిధులు గల్లంతయినట్లు ఉన్నతాధికారులు వివరించారు. ఈ మేరకు ఖాతాదారులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 6న పోస్టల్ వెబ్సైట్లో పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు అందింది. తర్వాత పూర్తి సమాచారం రావడంతో రంగంలోకి దిగిన పోస్టల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. గత పది రోజులుగా చేస్తున్న విచారణలో 33 మంది ఖాతాదారుల కెవిపి బాండ్‌ల నుండి ఆన్లైన్ ద్వారా మోసం జరిగినట్లు గుర్తించారు. సిబిఐ ఈడీకు కేసును అప్పగిస్తున్నట్లు పోస్టల్ ఇన్స్పెక్టర్ నక్క శ్రీకాంత్ చెప్పారు. ఇప్పటి వరకు 14 మందిని అనుమానితులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరిలో ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేశామన్నారు. ఉద్యోగుల లాగిన్ ఐడిల ద్వారా జరగడంతో ప్రాథమికంగా సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాండ్‌లు ఉన్న అందరికి డబ్బులు చెల్లించడం జరుగుతుందని పోస్టల్ ఇన్స్పెక్టర్ నక్క శ్రీకాంత్



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**కొత్తూరు, జూలై 25(వార్త):** గులివిందలపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది సమక్షంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎనిమిదేళ్లుగా సేవలందించిన ఉపాధ్యాయులు చింతాడ సురేష్‌బాబు, కె.శాంతారాం, ఎం.సుధాకర్ రావును దుశ్శాలువలతో, చిరు బహుమతులతో సత్కరించి, ఆత్మీయ కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు లలిత, ఉపాధ్యాయులు పుష్పకుమారి, స్వర్ణలత, రాజేష్, నాగభూషణం, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అధ్వానంగా రోడ్డు.. ప్రయాణికుల పాట్లు

(జి.సిగడాం)

జి.సిగడాం నుంచి పాగిరి గ్రామానికి వెళ్లే దారి గుంతలమయంగా తయారైంది. వాహనదారులకు ఇబ్బందిగా మారింది. బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణించాలంటే ప్రజలు నరకాన్ని చవి చూస్తున్నారు. మోటారుసైకిళ్లపై వెళ్లేవారు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. ఇటీవల స్కూటర్‌పై వెళ్లే ఉపాధ్యాయిని అదుపుతప్పి కింద పడిపోవటంతో కాలు విరిగి ఆసుపత్రి పాలయ్యారు.గుంతలో అదుపుతప్పి బైక్ నడిపే వ్యక్తి ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణికులు, బైక్ వ్యక్తి తీవ్రగాయాలై ఆసుపత్రి పాలయ్యారు. పాలకులు ప్రస్తుతానికి ప్యాచ్ వర్కులు చేపట్టయినా తమ ఇబ్బందులను తొలగించాలని విద్యార్థులు, అధికారులు, ప్రజలు కోరుతున్నారు.





## వితంతువులకు పింఛన్లు ఎప్పుడిస్తారు?

**జి.సిగడాం, జూలై 25(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తైనా వితంతువులకు పింఛన్ అందడం లేదని జి.సిగడాం వైసీపీ మండల అధ్యక్షుడుడోల వెంకటరమణ, ఎంపీపీ ప్రతినిధి మీసాల రమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ విమర్శించారు. శుక్రవారం వారు జి.సిగడాంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పథకాల అమలులో చేతులెత్తేస్తున్నారని ఎద్దేవా చేశారు. మండలంలో 75 మందికి స్పౌజ్ కేటగిరీలో పింఛన్లు మంజూరు చేసినా ఇప్పటికీ అందించలేదన్నారు. ప్రభుత్వం వీరికి పింఛన్లు అదేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొంకడాపుట్టి మహిళా సమాఖ్య కార్యవర్గం ఎంపిక



**మందస, జూలై 25(వార్త):** కొంకడాపుట్టి పంచాయతీలో గ్రామ సంఘం వార్షిక మహాజన సభ జరిగింది. నూతన పాలక కార్యనిర్వాహకవర్గాన్ని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. కొత్త సభ్యులతో క్లస్టర్ కోఆర్డినేటర్ దుర్గారావు ఆధ్వర్యంలో వీవోఏ పద్మ ప్రమాణ స్వీకారం చేయించారు. షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామ సంఘాల్లో మహాజన సభలు జరుగుతున్నట్లు వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. అధ్యక్షురాలిగా సవర రాజేశ్వరి, కార్యదర్శిగా భూలక్ష్మి, కోశాధికారిగా భువనేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా సంధ్యారాణి, ఉప కార్యదర్శిగా జయ ఏకగ్రీవంగా ఎంపికయ్యారన్నారు.కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు రాజారావు, స్వామినాయుడు, గ్రామ సంఘం పరిధిలోగల స్వయం శక్తి సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొత్తూరులో కార్డెన్ సెర్చ్



**కొత్తూరు, జూలై 25(వార్త):** కర్లెమ్మ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అహ్మద్ అలీ పర్యవేక్షించారు. పోలీసు బలగాలు కాలనీలోని ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టాయి. అపరిచిత వ్యక్తుల వివరాలను సేకరించారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేని ఐదు వాహనాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఏఎస్సై కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథలకు సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం

**మందస, జూలై 25(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి దాతృత్వం కొనసాగుతూనే ఉంది. సమితి ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని తల్లిదండ్రులను కోల్పోయిన కుమార్తెలకు అందజేశారు. నరసన్నపేట మండలంలోని దేవాది గ్రామానికి చెందిన మోహిని, యోగితల తల్లి కేన్సర్ తో మరణించింది. తండ్రి యాక్సిడెంట్‌లో మరణించడంతో అనాథలుగా మారిన మోహిని, యోగితకు సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఈ సాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు నరేంద్ర, బాషా, వినోద్, లక్ష్మీనారాయణ, హరిబాబు పాల్గొన్నారు.



## ఘనంగా సురేఖ పాణిగ్రహి అంతిమయాత్ర





**పలాస, జూలై 25(వార్త):** విప్లవ కవి, శ్రీకాకుళ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరిణి సురేఖ పాణిగ్రహి అంతిమయాత్ర శుక్రవారం బొడ్డపాడులో ఘనంగా నిర్వహించారు. తొలుత బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం వద్ద సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు తామడ త్రిలోచనరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, మద్దిల రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేషు, పీసీఎం జిల్లా కార్యదర్శి డి.గోవింద్, పీడీఎం రాష్ట్ర నాయకులు సాలిన వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, దాసరి శ్రీరాములు, అరసం జిల్లా కార్యదర్శి కృష్ణారావు, దున్న గోవిందు, కోనేరు గురయ్య, నిరంజన్ పాణిగ్రాహి, డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ రైతు ప్రగతి 6వ వార్షిక మహాసభ

**కొత్తూరు, జూలై 25(వార్త):** వెలుగు అసోసియేషన్ ప్రోత్సాహంతో ఆదివాసీ రైతు ప్రగతి 6వ వార్షిక మహాజన సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తూరు మండలంలోని 26 గ్రామాల నుండి 106 మంది సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు సవర నాగేశ్వరరావు.. గత ఆర్థిక సంవత్సర వార్షిక నివేదిక, ఆడిట్ లావాదేవీలు, వ్యాపార కార్యక్రమాలు, స్థిర ఆస్తుల వివరాలు, 2025-2026 ఆర్థిక ప్రణాళిక, అంతర్గత ఆడిట్, సభ్యుల ఎంపికపై వివరించారు. వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ సంజీవురావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందితే దాయం పెరుగుతుందని, జీడి ఉత్పత్తి మెరుగుపరచాలని సూచించారు. కొమ్మ కత్తిరింపు, చెట్ల రీప్లేస్‌మెంట్ లాంటి చర్యలు చేపట్టాలని కోరారు. వన్‌బీ సమస్య ఉన్నవారు సంబంధిత దరఖాస్తు చేయాలని సూచించారు. కొత్తూరు హార్టికల్చర్ ఆఫీసర్ మంగమ్మ మాట్లాడుతూ వాటాదారుల సంఖ్య పెరగాలని, వ్యాపారం ద్వారా లాభాలను పంచుకోవాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, జీడి తోటల్లో ప్రూనింగ్ చేయాలని కోరారు. చింత చెట్లు, ఎదురు చెట్లు నాటడానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ సవర ఆనందరావు, శ్రీను, మిన్నారావు, కార్యకర్తలు నారాయణ, రామకృష్ణ, జగదీష్, బాలరాజు, అడ్డంగి, గొట్టిపల్లి సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వసప కేజీబీవీ ఎస్వోపై చర్యలు తీసుకోవాలి



**కొత్తూరు, జులై 25(వార్త):** వసప కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం) ఎస్వో పల్ల రాధికపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన పేద విద్యార్థినులకు సరైన భోజన సదుపాయాలు కల్పించకుండా, వారిని ఆకలితో బాధపడే పరిస్థితికి ఎస్వో నెట్టారని ఆయన ఆరోపించారు. విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించడం, పనులు చేయించడం, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పౌష్టికాహార సరుకుల తరలింపుపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు.



## పి.శాసనంలో సుపరిపాలనలో తొలి అడుగు

**ఇచ్ఛాపురం, జులై 25(వార్త):** టి.బరంపురం పంచాయతీ పి.శాసనం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ నిర్వహించారు. ఏడాదిలో కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, పేదిని బాబ్జి, మెరుగు సూర్యనారాయణ, సాడి సహదేవ్ రెడ్డి, దుపాన సూర్య నారాయణ, మణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



**ఇచ్ఛాపురం, జులై 25(వార్త):** ఇచ్ఛాపురం పెద్దజగన్నాథ స్వామి దేవస్థానంలో కొలువు దీరిన మహాలక్ష్మి దేవికి శ్రావణశుక్రవార పర్వదినం సందర్భంగా ఉదయం అభిషేకం, అలంకరణ, కుంకుమ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఐదు రకాల పరిమళ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం జరిపారు. మహిళలు విష్ణు, లలిత సహస్ర నామ పారాయణను సామూహికంగా చేశారు.

## ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి : ఆర్ఎం



**ఇచ్ఛాపురం, జులై 25(వార్త):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్ఛాపురం బ్రాంచ్ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది సమన్వయ సమావేశం మండల మహిళా సమైక్యలో శుక్రవారం జరిగింది. నిరుపేద మహిళలకు పథకాలు సకాలంలో అందించడానికి బ్యాంకు, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్‌బీఐ జిల్లా రీజనల్ మేనేజర్ ఉదయ్ కుమార్ సింగ్ తెలిపారు. బ్యాంకు లావాదేవీలు, బ్యాంక్ పాస్బుక్స్ ప్రింటింగ్, బ్యాంకు రుణాలు పొదుపులు చెల్లింపు, విత్‌డ్రాలకు బ్యాంకులో వేరే కౌంటర్ ఏర్పాటు చేయాలని వీవోఎస్ కోరారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం ఎస్ ప్రసాదరావు, ఎస్బీఐ ఇచ్ఛాపురం చీఫ్ మేనేజర్ నీలకంఠ సాహు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, లక్ష్మీనారాయణ, ఫల్గుణ రావు, సుగ్గు నారాయణ రెడ్డి, సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మజ్జి' కుటుంబానికి మాజీ మంత్రి అప్పలరాజు పరామర్శ

**మందస, జులై 25(వార్త):** మఖరజోల గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్, సామాజికవేత్త మజ్జి పున్నయ్య, మాతృమూర్తి మజ్జి లక్ష్మీదేవి ఇటీవల మరణించారు. ఆమె కుమారులు పున్నయ్య, మజ్జి ధర్మారావును మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవార పరామర్శించి, తన సానుభూతి తెలిపారు. లక్ష్మీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లక్ష్మీదేవి మరణం తీరని లోటన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ఆమె సమర్థవంతంగా ముందుకు నడిపించారని కొనియాడారు. సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన వెంట మఖరజోల సర్పంచ్ బమ్మిడి ధర్మారావు, సనపల కామేశ్వరరావు, పార్టీ నాయకుడు బమ్మిడి భూపతి తదితరులు ఉన్నారు.





# జోరువానలోనే మధ్యాహ్న భోజనం

**-ఇదీ రొట్టవలస జడ్ ప్లస్ పాఠశాలలో దుస్థితి**

సరుబుజ్జిలి, జులై 25(వార్త): రొట్టవలస జెడ్ ప్లస్ పాఠశాలలో శుక్రవారం జోరువానలోనే మధ్యాహ్నం భోజనం విద్యార్థు లకు వడ్డించారు. వంటశాల, పాఠశాల గదులకు దూరంగా ఉండడంతో పిల్లలు వర్షంలో తడుస్తూ లైన్‌లో బారులు దీరారు. జెడ్ ప్లస్ కేటగిరి ఇచ్చిన పాఠశాలలో మౌలిక సదు పాయాల కల్పనలో ప్రభుత్వ జాప్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొన్ని తరగతుల గదుల్లో కింద కూర్చునే పరిస్థితి నెలకొంది. అదీగాక పలువురు విద్యార్థులు క్యారేజ్ తీసుకొస్తున్నారు. ఈ విషయం విద్యార్థులను ప్రశ్నించగా, కొందరు ఆరోగ్య రీత్యా, మరికొందరు భోజనాలు బాగాలేవని తెలిపారు. దీనిపై పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కత్తిరి రామకృష్ణను వివరణ కోరగా గతంలో చాలామంది క్యారేజ్ లు తెచ్చేవారని, ప్రస్తుతం అన్ని సరిదిద్దామన్నారు.

ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ చేపట్టి ..

# బాధితులకు న్యాయం చేయాలి

**-ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి**

**పలాస, జులై 25(వార్త):** ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను విని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట,మిస్సింగ్, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్పీ సూచించారు.



# సీజనల్ వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త

**-ఫీవర్ సర్వేలో క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా నిర్వహించండి**

**-కమిషనర్ నడిపేన రామారావు**

**పలాస, జులై 25(వార్త):** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పేపర్ సర్వేను జాగ్రత్తగా క్షేత్రస్థాయిలో నిర్వహించి, నివేదిక ఇవ్వాలని పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు ఆదేశించారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన హెల్త్ కార్యదర్శులు, ఆశ వర్కర్లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరి రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు చేసి ప్రజలు ఎటువంటి వ్యాధులు బారిన పడకుండా ముందు జాగ్రత్తగా చైతన్యవంతులను చేయాలని సూచించారు. వీధులు, ఖాళీ స్థలాల వద్ద గల మురుగు గుంటల్లో లార్వా (దోమలు ) అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు.



## గ్యాస్ వినియోగంపై నోటీసులు

**కొత్తూరు, జులై 25 (వార్త):** రెస్టారెంట్లు, హొటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, దాబాలు, టిఫిన్ షాపులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో. దీనికి సంబంధించి, అన్ని షాపులకు కొత్తూరు తసీల్దార్ కార్యాలయం వారు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల లోపు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా వాణిజ్య గ్యాస్ సిలిండర్లను ఉపయోగించాలని, ఎవరన్నా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



**చ్ఛాపురం, జులై 25(వార్త):** న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆవరణలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజ్ పాత్రో ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ సౌజన్యంతో శుక్రవారం నిరసన చేపట్టారు. న్యాయవాదుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష్యులు ఎం.సోమశేఖర రెడ్డి, నాగరాజ్ పాత్రో కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణం ఏర్పాటు చేసి అమలు చేయాలని, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్, ప్రతి కోర్టు ప్రాంగణంలో మహిళా వెయిటింగ్ హాళ్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి జీరు కామేష్, ఐ.ఏ.ఎల్ సభ్యులు ఎం.రాంబాబు, ఎ.బైరాగి, కె. ప్రసాద్. సీతయ్య, బి.వేణుగోపాల్, ఎన్వీ ఎస్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతా..సుఖీభవ..!

**-నిత్యాన్నదాతగా వి.విజయకుమార్**

**- 50 రోజులకు చేరిన అన్నదాన ప్రక్రియ**

**- లయన్ ఉర్లం శివతేజ పట్నాయక్**

**- నిత్యాన్నదానం కొనసాగిస్తాను**

**- వి.విజయకుమార్**

**శ్రీకాకుళం, జులై 25(వార్త):** అన్నవితరణ మహోత్తర కార్యక్రమమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షుడు ఉర్లం శివతేజ పట్నాయక్ అన్నారు. నిత్యాన్నదాతగా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయకు మార్ నిలుస్తున్నారని కొనియాడారు. 50 రోజులుగా ఏకధాటిగా నిత్యాన్నదానం చేయడం హర్షణీయమన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ నిత్యాన్నదానాన్ని నా జీవితాంతం కొనసాగిస్తామన్నారు.



కార్యక్రమంలో నైట్ షెల్టర్ నిర్వాహ కురాలు, చేయూత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్య రాజు వెంకటలక్ష్మి, నైట్ షెల్టర్ నివాసకులు, విజయ్ కుటుంబసభ్యులు, చింతలపూడి ప్రభు పాల్గొన్నారు.

# జనానికి మోసం.. బాబు నైజం



**మందస, జులై 25(వార్త):** సరియాపల్లి పంచాయతీ గ్రామంలో "బాబు షూరిటీ - మోసం గ్యారంటీ" కార్యక్రమం మండల ఉపాధ్యక్షుడు పీతాంబరం అధ్యక్షతన సర్పంచ్ బత్తిన వెంకట్ ఆధ్వర్యంలో జరిగింది. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎంత నష్టపోయారు,. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. ప్రజలు ఎంత మోసానికి గురయ్యారు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వివరించారు. రీ కాల్ చంద్రబాబు క్యూఆర్ కోడ్‌ను ప్రజలకు మొబైల్ ఫోన్‌లో చూపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నీలవేణి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సొర్ర ఢిల్లీరావు, పలాస నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, యువజన అధ్యక్షుడు హరికృష్ణ, యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, సాలిన లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గొరకల కేశవరావు, బుజ్జి, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు జయరాం, మామిడి కృష్ణారావు, సార రవి, సోషల్ మీడియా సభ్యుడు రామారావు, జీవన్, వైసీపీ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నందిగాం, జులై 25 (వార్త):** నర్సిపురం, మొండ్రాయివలస, సుబ్బంపేట, ఆకుల రఘునాథపురం గ్రామాల్లో సర్పంచ్‌లు పొందల లచ్చయ్య, పళ్ల అప్పారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలు, ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్ఆర్సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తమిరి ఫల్గుణరావు, వైసీపీ నాయకులు జడ్యాడ జయరాం, నడుపూరు పాపారావు, అంబోడి విష్ణు, అక్కురాడ లోకనాథం, బొంగి హనుమంతరావు, బొంగి మోహనరావు, దీర్ఘాసి కృష్ణారావు, టొంప రామారావు, బొంగి రాజు, పిట్ట కృష్ణారావు, నడుపూరు బాలయ్య, రాంబాబు, చలపతిరావు, బిరకట ఈశ్వరరావు, ఆరింగి రామారావు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**ఇచ్ఛాపురం, జులై 25(వార్త):** ఇచ్ఛాపురంలోని 17వ వార్డు లాలాపేటకు చెందిన మడ్డు చిరంజీవికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైంది. అనారోగ్యంతో బాధపడుతున్న చిరంజీవికి రూ.40,350ను ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో 17 వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

## అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**-ఆడబిడ్డ నిధిపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం**

**-తారాస్థాయికి చేరిన రెడ్ బుక్ పాలన**

**-ప్రజలను పక్కదారి పట్టిస్తున్న పాలకులు**

**- వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**



**పలాస, జులై 25 (వార్త):** కూటమి సర్కార్ ఏర్పడిన 14 మాసాల్లో ఎన్ని అప్పులు చేశారో, దేనికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి కూటమి సర్కార్ రూ.1.86 లక్షల కోట్లు అప్పులు చేయలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో పచ్చి అబద్దాలు చెప్పి, ప్రజలకు బాండ్లు ఇచ్చి ఓట్లు దండుకొని ఇప్పుడు మోసం చేస్తున్నారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలతో ఆడబిడ్డ నిధిపై నీలి నీడలు కమ్ముకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు 3000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని, ఇప్పుడు దాన్ని స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించడం దారుణం అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, చిన్నారులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఇలాగే కొనసాగిస్తే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని, ప్రజా ఆగ్రహం చవిచూడడం తప్పదని బమ్మిడి దుర్యోధనరావు హెచ్చరించారు.

## నెహ్రూ పార్క్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉంది

**-ఎమ్మెల్యే, కమిషనర్ దృష్టికి సుందరీకరణ విషయం**

**-ఏపీటీపీసీవో ఛైర్మన్ వజ్జ బాబూరావు**

**పలాస, జులై 25 (వార్త):** పలాస-కాశీబుగ్గల నడుమ అతి పెద్ద విస్తీర్ణంలో గల నెహ్రూ పార్క్ చుట్టూ రిటైర్డ్ టీచర్ బమ్మిడి నాగేశ్వరరావు సుమారు రూ.16 వేలతో నిర్మించిన మంచినీటి కొళాయిలను శుక్రవారం ఏపీటీపీసీవో ఛైర్మన్ వజ్జ బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్కు అభివృద్ధికి తమ వంతు చేయూత అందివ్వాలని కోరారు. పార్కు సుందరీకరణ విషయం ఎమ్మెల్యే శిరీష, కమిషనర్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. పార్కు అభివృద్ధిలో భాగస్వామిగా నిలిచిన బమ్మిడి నాగేశ్వరరావుని మెమెంటో తో పాటు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమములో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పండిత రాజేంద్ర, హనుమంతు మురళీమోహన్ దొర, బోయిన సత్యానందం, సీహెచ్ వాసు, దడియాల నరసింహమూర్తి, లండ లక్ష్మణరావు, ఇప్పిలి చాణుక్య, ధూపాన కృష్ణారావు, బెల్లాల శంకరరావు, చీరపు కృష్ణారెడ్డి, జడే మహేష్, సంతోష్ బెహరా, బందరు బుజ్జి, పేరడ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546